పత్రికాప్రకటన                                             కాకినాడ, అక్టోబర్ 16, 2017.

**ప్రజావాణిలో సామాజిక సమస్యలకు ప్రాధాన్యం.**

**జగ్గంపేట కంటి ఆపరేషన్ బాధితులకు రు . 1000 పింఛను.**

**వృద్ధులు, వికలాంగుల సమస్యల పై సత్వర పరిష్కారం.**

కాకినాడ కలక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే మీ కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలపై చేసే విజ్ఞాపనతోబాటు, సామాజిక సమస్యలు పరిష్కరించాలని కూడా పలువురు అర్జీదారులు కోరడంతో, తదనుగుణంగా సామాజిక భద్రతగా వారి సమస్యల పరిష్కారం చేపడుతున్నారు. సోమవారంనాడు కాకినాడ కలక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులలో తమ కుటుంబాలు ఆర్ధిక సమస్యలు ఎదుర్కొంటున్నామని, వరకట్నం సమస్యలు, వయో వృద్ధులను ఇంటిలో నుండి పంపివేస్తున్నారనే సమస్యలు జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రాకు ఏకరువు పెట్టారు. ఇటువంటి సమస్యలపై కూడా వివిధ శాఖల అధికారులు సత్వరం స్పందించాలని కలక్టర్ ఆదేశించారు. సోమవారంనాడు జరిగిన ప్రజావాణిలో కలక్టర్ నేరుగా వికలాంగులు, వృద్ధుల వద్దకు వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇటీవల జగ్గంపేట లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రిలో జరిగిన కంటి ఆపరేషన్ల మూలంగా కంటి చూపు దెబ్బతిన్న బాధితులు సోమవారంనాడు ప్రజావాణిలో తమ సమస్యను కలక్టర్ దృష్టికి తెచ్చారు . దీనిపై కలక్టర్ స్ప ందిస్తూ వీరిలో ఎనిమిది మంది సదరమ్ ధృవపత్రాలు ఇచ్చిన వారికి వెయ్యి రూపాయలు చొప్పున వికలాంగుల పింఛను మంజూరు చేసినట్లు కలక్టర్ తెలిపారు. వీరికి ఈ పింఛను నవంబరు మొదటి వారం నుండి చెల్లిస్తారని అదే విధంగా వీరికి ఆర్ధిక సహాయం అందించడం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం సిఫార్సు చేసామన్నారు. ఈ ప్రజావాణి లో పలువురు తమ భూములు ఆక్రమణలకు గురైయ్యాయని, వీటి పై తగు చర్యలు చేపట్టి న్యాయం చేయాలన్నారు. అదే విధంగా కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన పార్వతి,తన భర్త రైలు ప్రమాదంలో చనిపోయారని, ఇద్దరు పిల్లలతో ఉన్న తనకు ఏ ఆధారం లేదని కలక్టర్‌కు అర్జీ అందచేయగా, ఈమె దరఖాస్తును ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామన్నారు. జిల్లాలోని కిర్లంపూడి మండలం సింహాద్రిపురం కు చెందిన పీతల వీరవెంకట సత్యన్నారాయణ ఎలక్ట్రికల్ షాక్ మూలంగా శరీరం ప ని చేయక మూడు సంవత్సరాల నుండి అచేతనంగా ఉన్నారని, ఇతనికి ప్రతీ నెలా ఐదు వేల వరకు వైద్య ఖర్చులు అవుతున్నాయని, ఈ ఖర్చు భరించలేని స్థితిలో కుటుంబం ఉందని, అతని సోదరుడు పీతల వెంకట్రావు కలక్టర్‌కు నివేదించగా, దీనిపై కలక్టర్ స్పందిస్తూ, ఇతనిని ఆదు కొంటామని, ఇతనికి ఆవసరమైన ఆర్ధిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామన్నారు. పుట్టకొండ గ్రామానికి చెందిన వయో వృద్ధురాలు వాసం శెట్టి సత్తమ్మసమస్య పై కలక్టర్ స్పందిస్తూ ఆప్యాయంగా ఆమెను పలుకరించి, ఓపిగ్గా ఆమె సమస్యలు విన్నారు. తనను తన కుటుంబ సభ్యులైన పెద్ద కుమారుడు, కోడలు ఇంటి లో నుండి బయటకు పొమ్మంటున్నారని, దీనిపై న్యాయం చేయాలని కలక్టర్‌ను వేడుకొనగా, ఈ విషయమై కుటుంబ సభ్యులను పిలిపించి, వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలక్టర్ ఆదేశించారు. సోమవారంనాడు జరిగిన ప్రజావాణిలో పలు సమస్యలు పరిష్కారానికి జిల్లా కలక్టర్ ఆదేశాలిచ్చారు. ధవిళేశ్వరం ఎర్రగొండ 20వ వార్డుకు చెందిన కందుల సత్యవతి, తన భర్త కృష్ణ వికలాంగుడని, తాము నిరుపేదలమని, తన భర్తకు వికలాంగ పింఛను మంజూరు చేసి , రెండు నెలలు ఇచ్చారని, ఈ నెల పింఛను నిలుపుదల చేశారని తమకు ఏ ఆధారం లేదని, తిరిగి పింఛను మంజూరు చేయాలని కోరుతూ కలక్టర్‌కు అర్జీని అందజేయగా, ఇందుకు కలక్టర్ స్పందిస్తూ నిలుపుదల చేసిన పింఛన్‌ను వెంటనే విడుదల చేసేటట్లు చర్యలు చేపడతామని, ఇల్లు కూడా మంజూరు చేస్తామని, బాధపడవద్దని ఆయన ధైర్యం చెప్పారు. ఈ సమస్యలను నిర్ధిత కాల వ్యవధిలో పరిష్కరించాలని, సంబంధిత అధికారులను కలక్టర్ ఆదేశించారు. కలక్టర్ స్ప ందన పట్ల పలువురు అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేసారు.

ప్రజావాణిలో ప్రజాసమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని, అర్జీదారులు నేరుగా తమ అర్జీలను అందజేయవచ్చని కలక్టర్ సూచించారు. అర్జీదారులు ఎటువంటి మధ్యదళారీలను ఆశ్రయించకుండా తమ విజ్ఞాపనలను ఆందజేయవచ్చన్నారు. కలక్టరేట్‌లో మధ్యదళారీలు ఇతరులు అనవసర రాధాంతం చేస్తే వారి పై చర్య తీసుకొంటామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకోసమే మీకోసం ప్రజావాణి పెడుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.జితేంద్రకు సమస్యల పరిష్కారం పై కలక్టర్ తగు ఆదేశాలు జారీ చేశారు.

( సమాచార శాఖ చే జారీ )